స్కెచ్

# అపూర్వ చికిత్స

"నరేంద్ర"

డాక్టరు తాతయ్య చదువుల మనవడి అజీర్ణం పోగొట్టటంకోసం ప్రణాళిక సిద్ధంచేసే ఆలోచనలో మునిగివున్నాడు. ఆయన సిద్ధాంతం ప్రకారం వేసిన మందు రోగికి శాశ్వత గుణాన్ని యిచ్చేలాగ ఉండాలి. ఆ గుణం మనిషి నడతకి సంబంధించనీ లేక ఆరోగ్యానికి సంబంధించనీ మనవడికి మందు యిచ్చి పుట్టినప్పటినుంచి పేరుకునిఉన్న అజీర్ణాన్ని తగ్గించటమా లేక తింటున్న మూడు గిద్దల బియ్యపుటన్నం అమాంతంగా అరగిద్దెడు బియ్యపుటన్నానికి దించి, చిరుతిళ్లు మానిపించి, స్కూలుకు రానూ పోనూ నడిపించి ఆ అజీర్ణాన్ని తగ్గించటమా అన్న ఆలోచనతో మథన పడుతున్నాడు డాక్టరు తాతయ్య. ఇందుకోసమని నికార్సయిన చార్ మినార్ సిగరెట్లు ఒక డజను పెట్టెలు తగలేశాడు. చిట్టచివరకు ముట్టించిన సిగరెట్ జల్సాగా పారేశాడు.

* * *

మనవడు మర్నాడు పొద్దున లేచి పళ్లుతోముకుని పుస్తకాలు చేతబట్టి రెండు మూడు మార్లు పఠించాడు కాఫీ కావాలన్నట్లుగా. 8-30 దాకా అంతూ పంతూ లేదు. హడావిడిగా వంటింట్లోకి పోతే ఫెడీమని జవాబిచ్చింది బామ్మ "మీ తాతయ్య నీకు కాఫీ ఇవ్వవద్దన్నారు" అని. అదేమని అడిగే గుండె లేదు కాబట్టి గిరుక్కున వెనక్కు తిరిగి పుస్తకాల డెస్కు దగ్గరకి పోయి సొరుగు తెరిచాడు. ఉన్న చిల్లర డబ్బులు కాసిని నిన్ననే కాఫీ హోటలుకు, బయటవున్న ముదిరిన మొక్కజొన్న కండెలకు అయిపోయినవి. ఖాళీ సొరుగు వెక్కిరిస్తూ కనపడ్డది ప్రస్తుతం. మోత మోగేటట్లు అమాంతంగా సొరుగు వెనక్కునెట్టి మరుక్షణంలో వంటింటి వైపుకు చూశాడు బెదురుతో. పీకుతున్న కాళ్ల సహాయంతో శరీరాన్ని చాపమీదికి చేరవేసి పుస్తకాలు తెరిచాడు. 9-30 కల్లా ఒక పేజి తిరగేశాడు. ఇంతలోనే "అన్నానికి రారా నాయనా" అని బామ్మ కేక. ఆకలి అతని చేతిలో పుస్తకాన్ని కిందపడేయించి కాళ్లుచేతులు కలిపి బరబరా యీడ్చుకు వెళ్లి కంచంముందు కూలేసింది. కంచం ముందుకు లాక్కుని తలెత్తి చూసేసరికి బామ్మ కాఫీకప్పుతో అన్నం కలుపుతున్నది. అనుమానంతో చుట్టూ చూశాడు. గట్టుమీద జాడీలు, మూలగా బొగ్గుల కుంపటి, ఎదురుగా అన్నపుగిన్నె, దానిపక్కన బామ్మ, ఈ యిల్లు హోటలు మటుకు కాదు అన్నందుకు సాక్ష్యంగా కన్పిస్తున్నాయి. మరేమిటి యీ ఖర్మం? సందేహంతో అడిగాడు బామ్మని "ఏమిటి బామ్మా కొండయ్య బియ్యం ఇయ్యలేనా" అని. "ఏమిటో నాయన మీ తాతయ్య చెప్పారు, నేను చేస్తున్నాను. అంతే. నాకేమీ తెలియదు. కావలిస్తే మీ తాతయ్య నడుగు" అని బామ్మ ముక్తసరిగా పాము చావకుండా కర్ర విరగకుండా సమాధానమిచ్చి తనమీదమటుకు నేరం లేకుండా చేసుకుంది. గుడ్లనీళ్లు గుడ్లకుక్కుకుని ఆ పెట్టిన అన్నాన్ని ఫలహారంచేసి పుస్తకాలు చేతబట్టి బయటికి వచ్చాడు. ఇంతా అయింతర్వాత రిక్షాకు డబ్బులు అడగ బుద్ధివేయలేదు. పైగా బామ్మ "యిదుగోరా నాయనా, ఈ కానీ తీసుకుని ఏమైనా కొనుక్కో" అనికూడా అనలేదు. దాంతో చిరాకెత్తి చరచరా బళ్లోకి నడిచి వెళ్లాడు. పంతులుగారు చెప్పే పాఠం దారి దానిది. ఒక్కసారి తనవూరు తెనాలివెళ్లి అమ్మా నాన్నతో యీ సంగతి చెప్తే సగం దుగ్ధ అణుగుతుందనే ఆలోచనతో యితని దారి యితనిది. అందుచేత "ఇండియాకు రాజధాని యేది?" అన్న ప్రశ్నకు "తెనాలి" అని సమాధానం వచ్చింది యితనివద్దనుంచి. పంతులుగారు అమాంతంగా యితనిదగ్గరకు లంఘించి గూబ కదలేశారు. గొంతులోనే యేడుపు దిగమిం

గాడు కుఱ్ఱాడు. "ఒంటేలు బెల్లు" కొట్టిం తర్వాత క్లాసునుంచి పారిపోయి పార్కులో బడివిడిచిపెట్టేవరకూ గడిపి బుద్ధిమంతుడల్లే యింటికి చేరాడు. మధ్యాహ్నపు అన్నం లేక పోయినా కనీసం కాఫీ అయినా బామ్మ యిస్తుం దని ఆశపడ్డాడు. బజారుగదిలో పెద్ద పులల్లే తాతయ్య, ఆయన కెదురుగా పోజరులో కూచుని వున్న బామ్మదగ్గరనుంచి ఏ సూచనా రాలేదు. వీళ్లు తనమీద కత్తికట్టారా అనిపించింది. కడుపులో పేగులు మూటకట్టుకుని లేచి నుంచుని పుస్తకాలు తీసుకున్నాడు. కాళ్లు లేలి పోతున్నట్లనిపించింది. ముందుకు తూలాడు. ఐదునిమిషాలాగి మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ బెదురుతో తాతయ్యవంక క్రీగంట ఒకమాటు చూచి, మళ్లా అసహ్యంతో కళ్లు యిటు తిప్పుకుని మెట్లుదిగి వెళ్లాడు. బామ్మ తాతయ్య యిదంతా తనిఖీ చేస్తూనే వున్నారు. బామ్మ మనవడివంక జాలిగా చూచి మళ్లా మొగుడి కళ్లనుచూచి పైకుబికిన జాలిని అణచు కుంది. తాతయ్య మటుకు మనవడి అజీర్ణపు తగ్గుదల ప్రథమదశలో వుందని గొప్ప సంతోష మయింది. కాని తాతయ్యకు ఒక అనుమానం పట్టుకుంది. "వీడు అసాధ్యుడు. నేను కాఫీ అర్థణా యివ్వకపోతే తెనాలికి రాసి రెండో మూడో రూపాయలు అడ్రెసుకు తెప్పించుకోవచ్చు. ఇదికనక ఆయె వ్యాపకం మొదలంటూ చెడుతుంది." అని ఆయన అనుమానం. అందుకని నాలుగు పెట్టెల సిగిరెట్లు తగలేసి ఆలోచించి ఒక ఉత్తరం రాశాడు తెనాలిలో వున్న కొడుకుకి, "వీడికి యేమాత్రం డబ్బా మీరు చేతికి యివ్వవద్దు, పంపవద్దు. వీడు సెలవులకు యింటికి వచ్చి మళ్లా యిక్కడికి వచ్చేటప్పుడు రైలు ఛార్జీకి సరి పోయేది మాత్రం యివ్వండి. అదీ యిదీ తిని జబ్బు తెచ్చుకుంటే నేను వాడికి చేయలేను" అని. అద్దరిన యిద్దరిన మొత్తానికి కట్టుదిట్టం చేశాడు.

ఆరోజు రాత్రికూడా కుఱ్ఱాడికి యిదే అను భవం. పైగా తాతయ్య అన్నపుగిన్నెను తనిఖీ చెయ్యటం మొదలెట్టాడు. బామ్మకు జాలంటూ ఏమాత్రమున్నా వుంటే అదికూడా దీనిమూలాన



"పల్లెటూరు"లో సావిత్రి

హరించిపోయింది. కుఱ్ఱాడికి రాత్రి పొద్దు పోయిన తర్వాతగాని నిద్రపట్టలేదు.

* * *

పదిరోజులు దొర్లిపోయ్. కుఱ్ఱాడు వెళ్లా ననుకున్నరోజున స్కూలుకు వెడుతున్నాడు. ఓపిక లేదనుకున్నరోజున మానేసి పార్కులో గడుపుతున్నాడు. తాతయ్య పన్నిన వ్యూహాన్ని ఛేదించటానికి ఆతగాడికేమీ ఉపాయం పాలు పోవటంలేదు. పదునాల్గు ఏళ్లు నిండీ నిండని ఆ కుఱ్ఱాడు పెద్ద మేధావికి మల్లే ఆలోచిస్తూం డాడు తల రెండుచేతుల సందునా యిరికించి. పైగా యింటిదగ్గరనుంచి జాడా జవాబు లేదాయె.

సంపూర్తిగా స్కూలు యెగ్గొట్టి ఆ పార్కులో పగల్లా కాపురం చేసే కుఱ్ఱా డొకడున్నాడు. అతనికీ ఇతనికీ స్నేహం అయింది. స్నేహంవల్ల అనుసాన్యంతమల్లే

అతుక్కుపోయినారు. ఈ ప్రతాపరుద్రుణ్ణి విడిపించేందుకు ఆ యుగంధరుడు వ్యూహాలు పన్నాడు.

* * *

సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు తాతయ్య డ్రాయరు తాళం వంక పరికించి పరీక్షగా చూశాడు మనవడు. తలకాయ ఊగించి హుషారుగా బజారు వెళ్లాడు మిత్రుడితో కలిసి. ఒక తాళాల కొట్లోకిపోయి మారు తాళం చెవి కొనేశాడు మిత్రుడు బదులుగా యిచ్చిన రూపాయి నోటు మార్చి. ఇంటికి తిరిగి వచ్చాడు. తాతయ్య ఊళ్ళోకి పోయిన సమయం బామ్మ బయటికి వెళ్ళిన సమయం కనిపెట్టి బ్రహ్మభేద్యమయిన డ్రాయరును అమాంతంగా చీల్చి లోపలికి పోయి పది రూపాయల నోటుతో బయటికి తిరిగివచ్చాడు.

నాలుగు రోజుల్లో పది రూపాయల్ని నమిలేశారు అతనూ మిత్రుడున్నూ కలిసి. బళ్లోకి పోతున్న మనవణ్ణి చూశాడు ఒక రోజున డాక్టరు తాతయ్య. మొన్న కాక మొన్న కాళ్ళీడ్చుకుంటూ నడిచిన మనవడు, లంఖణాల ముఖంతో వున్న మనవడు ఈరోజున జబర్దస్తీగా హుషారుగా పోతున్నాడు. అజీర్ణం తగ్గిన లక్షణాలు కనపడకపోగా మళ్ళీ ఏదో పెట్టుకొస్తున్నట్లు కనపడింది ఆయనకు. "పీడ తాడు తెగ ఎక్కడో ఏదో కతికాడు" అని కలవరపడ్డాడు. కుర్రాడు మాత్రం తాను మస్తుగా తింటూ తన మిత్రుడికి టీ పార్టీలుకూడా మొదలెట్టాడు. అతను వ్యూహం పన్నినందుకు ఫలితంలో అతనికికూడా వాటా వుండాలని మొదటనే ఖరారునామా రాసుకున్నారు కాబట్టి మిత్రుడికి టీ పార్టీలు తప్పని సరి అయినాయి. ఫలితంగా యిటు బజార్లో కనపడ్డ అడ్డమయిన గడ్డి మెక్కటం, అటు ప్రయివేటుక్లాసుల నెపంతో పట్టపగటి సినిమాలకు వేంచేయటం కూడా తప్పని సరి అయింది. తత్ఫలితంగా డ్రాయరులో బొత్తికి పరిమితి తగ్గటం స్కూలులో అటెండెన్సు తగ్గటంకూడా పరిపాటి అయింది. ఇవన్నీ పెనవేసుకుని అబ్బాయిగారి కడుపులోకి జబ్బుగా ఒక వైపునుంచి, స్కూలు మానిన సంగతి తెలిసి తంతారేమోననే దిగులుగా ఒక వైపునుంచీ ప్రవేశించి అతగాణ్ణి మంచంమీదకు చేర్చినయ్. తాతయ్య, బామ్మ గాభరాపడ్డారు. తన ప్రణాళికవల్ల అజీర్ణం తగ్గాల్సింది పోయి పైగా జ్వరం అంకించుకున్నదనే భయంతో డాక్టరు తాతయ్యకు ఏదీ అంతుబట్టలేదు. స్టెతస్కోపుతో పరీక్షచేసి, వేళ్ళతో కడుపు మీద అదిమి చూస్తే వేలెడు మందాన లివరు కనిపించింది. డాక్టరు తాతయ్యకు బుర్ర తిరిగిపోయింది. దానిమీద ఆయన ఆ జ్వరాన్ని, లివరును తగ్గించటానికి వేరొక పంచవర్ష ప్రణాళిక సిద్ధపరుస్తున్న సమయంలో తెనాలినుంచి కొడుకూ కోడలూ బండి దిగి వచ్చారు. ఇంక బామ్మ ధైర్యం తెచ్చుకొని ఇంకొక డాక్టరు కోసం కబురు పెట్టింది కొడుకు ద్వారా. డాక్టరు తాతయ్యకు ఒళ్లు మండి పక్క ఊరికి ప్రయాణం కట్టాడు రోగుల్ని చూసి వస్తానని. బామ్మ వీధి తలుపు బిగించి రామచంద్రుడి పటానికి నమస్కారం చేసి అంది: "ప్రతిసారీ ఆయన అయ్యవారిని చేయబోతారు. కోతి అవుతున్నది. ఆయనకు ప్రమాదం కాకుండా చూడు స్వామీ" అని.

అవసరమైన సమయంలో కాస్త గుండెధైర్యం లేకపోవడంవల్ల అనేక వ్యక్తుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభ రాణించకుండా పోతున్నది. ప్రతిదినం లోకంలో ఎందరో అనామకులుగా మరణిస్తున్నారు. వాళ్లలో అనేకులకు యింకొంచెం చొరవ, తెగింపు—లేక ధైర్యం ఉండివుంటే, అంత అనామకంగా మరణించి ఉండరు. వాస్తవం ఏమిటంటే, యీ ప్రపంచంలో మనం ఏ పని సాధించాలన్నా—చేతులు ముడుచుకుని, నీళ్లు నములుతూ ఏం చేస్తే ఏం జరుగుతుందో అని కూర్చోకూడదు. ముందు కార్యరంగంలోకి ఉరకడం—అదీ ముఖ్యం.—సిడ్నీ స్మిత్.